RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 19 | పేజీలు : 4 | గురువారం 23 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

- ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..
- ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు
- కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ
- దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా
- తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టేది లేదన్న మోదీ



## జగన్ గందరగోళం సృష్టిస్తున్నారు

- అమరావతిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్
- అమరావతి అభివృద్ధిని జగన్ కళ్లారా చూడాలన్న గొట్టిపాటి
- అమరావతి అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని ధీమా

**అమరావతి**

రాజధాని విషయంలో వైసీపీ అధినేత జగన్ అనవసర గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తికమక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. జగన్ కనీసం ఒక్కసారైనా నేరుగా వచ్చి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూడాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమరావతి త్వరలోనే ఒక అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజం

- అప్రమత్తంగా ఉండాలి: సీఎం చంద్రబాబు
- మెగా డీఎస్సీని ఢిల్లీ ఆందోళనలతో ముడిపెట్టడానికి వైకాపా ప్రయత్నిస్తోంది
- జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారమవుతాయి
- మంగళగిరిలో ఇళ్ల పట్టాల పంపిణీకి మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు
- ప్రతి లబ్ధిదారుడికి స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారు
- మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని చోట్లా సమన్వయంతో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలి




**అమరావతి**

గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. క్యాబినెట్ భేటీలో అజెండా అంశాలు ముగిశాక తాజా పరిస్థితులపై ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీని ఢిల్లీ ఆందోళనలతో ముడిపెట్టడానికి వైకాపా ప్రయత్నిస్తోందని సీఎం దృష్టికి మంత్రులు తీసుకెళ్లారు. వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజమని చంద్రబాబు మండిపడ్డారు. అనంతరం మరికొన్ని అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారమవుతాయని చంద్రబాబు అన్నారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాల పంపిణీకి మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని కొనియాడారు. ప్రతి లబ్ధిదారుడికి స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని చోట్లా సమన్వయంతో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాఖాపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మంత్రులే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలపై మంత్రులు ప్రెస్‌మీట్‌లు పెట్టి చేతులు దులుపుకొన్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై తగ్గేదేలే..

- చర్చలకు తావులేదు: సీజేపీ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గేది లేదన్న సీజేపీ
- తదుపరి చర్చలు నిరసన స్థలమైన జంతర్ మంతర్‌లోనే జరగాలని డిమాండ్



## హిట్లర్ పుట్టిన ఇల్లు ఇకపై పోలీస్ స్టేషన్

- ఆస్ట్రియా ప్రభుత్వం కీలక నిర్ణయం
- హిట్లర్ పుట్టిన ఇంటిని పోలీస్ స్టేషన్‌గా మార్చిన ఆస్ట్రియా ప్రభుత్వం
- నియో-నాజీలకు యాత్రాస్థలంగా మారకుండా నిరోధించడమే లక్ష్యం
- 20 మిలియన్ యూరోల భారీ వ్యయంతో భవనం పునరుద్ధరణ
- ప్రభుత్వ నిర్ణయంపై మిశ్రమ స్పందనలు, హక్కుల సంఘాల విమర్శలు
- చరిత్రను మరుగునపరిచే ప్రయత్నమంటూ పలువురి ఆరోపణ

## ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం
- అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ఆరుతడి పంటలు వేసేలా రైతులకు అవగాహన



**హైదరాబాద్**

ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు.

## విద్యార్థుల మృతికి కారణమైన వాళ్లు క్షమాపణ చెప్పాలి



- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్‌ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదు?
- ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం
- "నాకు రెండు ఓట్లు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు.. దానిపై ఫిర్యాదు ఇవ్వమనండి. తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తా.
- గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు
- కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది
- హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది.

**హైదరాబాద్**

రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. మీడియాతో సీఎం చిట్‌చాట్ నిర్వహించారు. తనకు రెండు చోట్ల ఓటు ఉన్నట్లు బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలపైనా రేవంత్‌రెడ్డి స్పందించారు. "నాకు రెండు ఓట్లు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు.. దానిపై ఫిర్యాదు ఇవ్వమనండి. తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తా. కలెక్టర్‌కు దరఖాస్తు చేసి నా ఓటును బదిలీ చేయించుకున్నా. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలి. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్‌ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదు? భాజపా నేతల మధ్య అంతర్గత కొట్లాటలు జరుగుతున్నాయి. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్‌ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు.




## ప్రపంచ అనిశ్చితుల మధ్యా భారత్ బలంగా ముందుకు సాగుతోంది

- వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటన్న ఆర్‌బీఐ
- జూన్ వరకు ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగినట్లు వెల్లడి

## క్షమాపణ చెప్పకుంటే లీగల్ నోటీసు పంపుతా

**హైదరాబాద్**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు తన లీగల్ టీమ్ త్వరలోనే ముఖ్యమంత్రికి నోటీసు పంపనుందని వెల్లడించారు. కొడంగల్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ కేటీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్‌ఎస్‌కు గానీ, తన కుటుంబానికి గానీ, తనకు గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పేపర్ లీక్‌లాంటి సున్నితమైన అంశంపై ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా తప్పుడు ఆరోపణలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి చౌకబారు రాజకీయాల కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. కనీసం ఒక్కసారైనా ముఖ్యమంత్రిలా వ్యవహరించాలని రేవంత్ రెడ్డికి సూచించారు. తనపై తరచూ అసభ్యకరమైన, అర్థంలేని ఆరోపణలు చేసినప్పటికీ ప్రతి సందర్భంలో స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తాను మౌనంగా ఉండడాన్ని ఆరోపణలను అంగీకరించినట్లు భావించవద్దన్నారు. "బురదలో కుస్తీ పట్టడం నాకు ఇష్టం ఉండదు. అందుకే చాలా సందర్భాల్లో స్పందించను" అని వ్యాఖ్యానించారు.

గురువారం 23 జూలై 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# "పల్లె "ప్రజలను ఆఫీసులో చుట్టూ తిప్పుకోవద్దు..!!

....ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపండి

....అదే సమస్యపై అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు.

....చేయలేని పనులూ ఏమైనా ఉంటే ప్రజలకు నేరుగా చెప్పండి

.....అధికారులకు సూచించిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి.

....పుట్టపర్తి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి





**పుట్టపర్తి జూలై 23 సీమ వార్త సాయంత్రం.** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఒకే సమస్య కోసం ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏదైనా పని నిబంధనల కారణంగా చేయలేని పరిస్థితి ఉంటే, ఆ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించి, ఎందుకు చేయలేకపోతున్నామో పూర్తి కారణాలను తెలియజేయాలని సూచించారు. గురువారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా మరియు బాధ్యతాయుతంగా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు.

# నేతన్నలకు తీపి కబురు!

....నేతన్న భరోసా పంపిణీకి మంత్రివర్గం తీర్మానం

....అర్హులైన ప్రతి కార్మికునికి రూ.25 వేలు చొప్పున అందించేందుకు ఏర్పాట్లు

....ఆగస్టు 7న అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఖాతాల్లోకి జమ

....నేతన్న భరోసా చూసి కేతిరెడ్డి జగన్నాటకం బట్టబయలు -- హరీష్ బాబు






**ధర్మవరం, జూలై 23: సీమ వార్త సాయంత్రం.**
ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలకు తీపి కబురు అందించింది. నేతన్న భరోసా కింద ప్రతి చేనేత కార్మికునికి ప్రతి ఏడాది రూ. 25వేలు అందించేందుకు తీర్మానించింది. గురువారం విజయవాడలోని మంత్రివర్గ సమావేశంలో చేనేత పరిశ్రమను ఆదుకోవడంలో భాగంగా ప్రతి నేతన్నకు నేతన్న భరోసా ఇచ్చేందుకు మంత్రివర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల మంది నేతన్న భరోసా అందనుంది. చేనేతలు అధికంగా ఉండే ఉమ్మడి అనంత జిల్లాలో దాదాపు 24 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుండగా అందులో చేనేత పరిశ్రమకు పెట్టింది పేరైన ధర్మవరానికి అధికంగా చేనేత భరోసా రావడం పట్ల కూటమినేతలు - మిగతా3లో

# భూ సంరక్షణ పనుల్లో కలెక్టర్..!!

ఎల్ నినో.....సవాళ్లను అధిగమించే దిశగా ప్రకృతి వ్యవసాయం

....క్షేత్రాలను సందర్శించిన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్







**మడకశిర,జూలై 23: సీమ వార్త సాయంత్రం.**
ప్రకృతి వ్యవసాయం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కొంటూ, నేల ఆరోగ్యం మరియు నీటి సంరక్షణతో స్థిరమైన ఆదాయం పొందవచ్చని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. మడకశిర డివిజన్‌లోని ఆమిదాలగొంది గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా అమలవుతున్న ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కార్యక్రమాలు, ఏ గ్రేడ్ నమూనా క్షేత్రాలు మరియు భూసంరక్షణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.గత మూడేళ్లుగా పీఎండీఎస్ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న రైతులు రమేష్,లోకేష్, ఓంకారమ్మల పొలాలను కలెక్టర్ సందర్శించారు. జీవవైవిధ్యం, భూసార పరిరక్షణ మరియు వర్షాధార వ్యవసాయంలో రైతులు సాధించిన ఫలితాలను పరిశీలించి వారి కృషిని అభినందించారు.ఎస్సీ రైతులు ఆంజనప్ప,ఓబుళప్ప చేపట్టిన పీఎండీఎస్ విత్తే కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారు పాల్గొన్నారు . రైతులతో కలిసి విత్తనాలు విత్తడం ద్వారా ప్రకృతి వ్యవసాయంపై తన నిబద్ధతను చాటారు.వాలుగా ఉన్న ఎస్సీ రైతుల భూముల్లో వర్షపు నీటిని నిల్వ చేయడం, నేల కోతను తగ్గించడం మరియు నేలలో తేమను పెంచడం కోసం సిద్ధం చేసిన 'హాఫ్ మూన్ మోడల్' పనులను కలెక్టర్ గారు పరిశీలించారు.రైతు రజని కి చెందిన పత్తి క్షేత్రాన్ని సందర్శించి పంట నాణ్యతను పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడినిచ్చే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతుల భవిష్యత్తుకు ఎంతో భరోసానిస్తాయని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... "ప్రకృతి వ్యవసాయం నేల ఆరోగ్య పరిరక్షణకే కాకుండా, సాగు ఖర్చులను తగ్గించి, ఎల్ నినో వంటి వాతావరణ మార్పులను మరియు వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు రైతులకు ఒక వరంగా నిలుస్తుంది.పీఎండీఎస్ వంటి మోడళ్లను జిల్లాలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది."

డి పి ఎం లక్ష్మ నాయక్ నేల స్వభావం, వర్షపు నీటి సమర్థ వినియోగం, పంటల ఎంపిక మరియు పీఎండీఎస్ విధానం ద్వారా చేకూరే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (డిఏఓ) కృష్ణయ్య, తహసీల్దార్ ముకుందా, సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ)కృష్ణమీనన్, ఏపీసీఎన్ఎఫ్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్, మీ రమేష్, వ్యవసాయ అధికారి (ఏఓ) వీరనరేష్, ఇతర ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, స్థానిక రైతులు మరియు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు విస్తృతంగా పాల్గొన్నారు.

## శరవేగంగా.... స్పీడుగా పరిటాల రవీంద్ర

# సాగునీటి స్కీమ్!

....కాలువ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

....వచ్చే ఏడాదిలోగా కాలువ ద్వారా పేరూరుకు నీరు వస్తుంది

....పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సునీత సూచన

....గత ప్రభుత్వ పాపం వలనే ఇంత ఆలస్యమైందన్న పరిటాల సునీత





**రామగిరి జులై 23 సీమ వార్త సాయంత్రం.**
జీడిపల్లి రిజర్వాయర్ నుంచి అప్పర్ పెన్నార్ (పేరూరు) ప్రాజెక్టు వరకు నిర్మిస్తున్న పరిటాల రవీంద్ర సాగునీటి పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. రామగిరి మండలం దుబ్బార్లపల్లి సమీపంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ పనులను పరిశీలించారు. రామగిరి - పేరూరు డబల్ రోడ్డు బ్రిడ్జి కిలోమీటర్ 50.075 వద్ద, ఎగువపల్లి - పేరూరు సోలార్ సింగల్ రోడ్డు కిలోమీటర్ 50.925 వద్ద, మక్కినవారిపల్లి సమీపంలో పేరూరు - గరిమేకలపల్లి డబల్ రోడ్డు కిలోమీటర్ 52.910 వద్ద జరుగుతున్న నూతన బ్రిడ్జిల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్లు కూడా పాల్గొన్నారు. పనులు ఎంత వరకు వచ్చాయి, నాణ్యత ఎలా ఉందన్న విషయాలను ఎమ్మెల్యే సునీత ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో సాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించాలని 804కోట్లతో పనులు మొదలు పెట్టామన్నారు. రైతులు కూడా భూములు ఇచ్చారని.. కొంత వరకు పనులు జరిగాయన్నారు. కానీ ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అడుగు కూడా పని చేయలేదన్నారు. భూమిలిచ్చిన రైతులకు కూడా పరిహారం ఇవ్వలేదన్నారు. భూగర్భజలాలు కూడా పూర్తిగా అడుగంటాయన్నారు. వారు చేసిన పాపం వలనే ఇంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అయితే మళ్లీ అధికారంలోకి రాగానే పనులు పునఃప్రారంభించామన్నారు. ప్రస్తుతం పనులు చాలా - మిగతా3లో

## శరవేగంగా.... స్పీడుగా పరిటాల రవీంద్ర సాగునీటి స్కిమ్..!!



-మొదటిపేజీ తరువాయి
వేగంగా జరుగుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు డబ్బు విషయం కూడా లెక్క చేయకుండా పనులు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది లోగా పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. చిన్న చిన్న పనులు పెండింగ్ లో ఉన్నా.. నీరు వచ్చేందుకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారన్నారు. దీనిపై అనునిత్యం పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. ఇటీవల హంద్రీనీవా కాలువ పై పర్యటించిన వైసీపీ నాయకులు ఈ పనులు పరిశీలించి ఉంటే బాగుండేదన్నారు. వారు ప్రభుత్వంలో ఏం చేశారు.. ఇప్పుడు ఏం చేస్తున్నారన్నది అర్థమయ్యేదని ఎమ్మెల్యే సునీత అన్నారు..

## నేతన్నలకు తీపి కబురు..!!



-మొదటిపేజీ తరువాయి
ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు 15 వేల మంది ధర్మవరం చేనేత కుటుంబాలకు ఈ పథకం వర్తించనుంది.

**ఆగస్టు 7న పంపిణీకి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్.....**

వచ్చేనెల ఆగస్టు 7న నేతన్న భరోసా కింద ఒక్కొక్కరికి రూ. 25 వేలు అందించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కూటమి నేతలు పేర్కొన్నారు. ఆగస్టు 7న అంతర్జాతీయ చేనేత దినోత్సవం కావడంతో ఆరోజు ఈ పథకాన్ని విడుదల చేసి ప్రతి నేతన్న కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే తమ అభిమతమని కూటమి నాయకుల పేర్కొంటున్నారు. రాజకీయాలకు అతీతంగా ఇప్పటికే పింఛన్లు, తల్లికి వందనం వంటి ఎన్నో పథకాలు అందిస్తున్నామని తాజాగా ప్రతి నేతన్నకు నేతన్న భరోసా అందించడమే తమ లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంటోంది.ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు మంత్రులకు నేతన్నల కృతజ్ఞతలు నేతన్న భరోసా పథకాన్ని అమలు చేయడం పట్ల ధర్మవరం చేనేత కార్మికులు, చేనేత కుటుంబాలు, నేతన్నలు హర్షం వ్యక్తం చేశారు. తమ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటా రూ.25 వేల ఆర్థిక భరోసా కల్పించినందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, అలాగే రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గార్లకు ధర్మవరం నేతన్నలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరం చేనేత పరిశ్రమ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ నిర్ణయం వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు చేనేత వృత్తికి కొత్త ఊపునిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

**కేతిరెడ్డి జగన్నాటకం బయటపడింది.... హరీష్ బాబు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు, మరి ఎన్నో పథకాలు ప్రజల కోసం అటు నరేంద్ర మోడీ ఇటు చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు. ధర్మవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని ఆదర్శంగా తీసుకురావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. దీంతో తమ ఉనికిని ఎక్కడ కోల్పోతామోనని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఊసరవెల్లి రాజకీయాలు చేస్తూ ప్రజల్లో మరింత చులకన గా మారిపోతున్నారన్నారు. ప్రభుత్వం నేతన్న భరోసా ప్రకటించినప్పటికీ చేనేత పరిశ్రమలో తమ ఉనికిని ఎలాగైనా చాటుకోవాలని కుట్రలకు దారితీసారన్నారు. అందులో భాగంగానే బయట వ్యక్తులను రప్పించి ర్యాలీలు నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు. కేతిరెడ్డి నిర్వహించిన ర్యాలీకి చేనేత కార్మికులు వెళ్లకపోవడమే అందుకు నిదర్శనం అన్నారు. కేతిరెడ్డి కుట్రలు కుతంత్రాలు తెలిసిన ధర్మవరం ప్రజలు మున్ముందు కూడా ఆయనకు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉండారనడానికి ఇదే నిదర్శనం అన్నారు.

## మహా ద్వారా నిర్మాణానికి రెండు కోట్ల 82 లక్షల కు ఒప్పందం



**మడకశిర జూలై 23 సీమ వార్తసాయంత్రం.** నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలం జీర్గేపల్లి శ్రీ అమ్మాజీ దేవాలయం మహా ద్వారా నిర్మాణం మరియు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం 2.82.00000=00 నిర్మాణం కోసం సెల్ఫీ జైకర్ ఒప్పందం ఇవ్వడం జరిగింది అని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గతంలో ఇప్పటికే కోటి రూపాయలు ఇవ్వడం జరిగిందని, మిగతా కోటి 82 లక్షలు త్వరలో ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. భక్తాదులతో సేకరించిన నిధులను ఆలయ నిర్మాణానికి ఖర్చు పెట్టడం జరుగుతుందని దానిలోని భాగంగానే ఈ నిధులు కాంట్రాక్టర్కు అప్పజెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు శ్రీనాథ్ గౌడ్, సన్నమారేగౌడ్, మారే గౌడ్, ఈశ్వరప్ప, బండి రమేష్, సిద్దే గౌడ్, ముడిపే గౌడ్, సిద్దే గౌడ్, రామేగౌడ్, అర్చకులు మారన్న తదితరులు ఉన్నారు.

# రైతులు తప్పనిసరిగా పంటల బీమా పొందాలి

...ఎస్.ఎన్. మంజునాథ్ సూచన
పంటల భీమా, కరవు నిర్వహణపై అవగాహన.
.....కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఎస్ ఎన్ మంజునాథ్



**బళ్లారి, జూలై 23 సీమవార్త: సాయంత్రం.** ప్రస్తుతం గ్రామ పంచాయతీ స్థాయిలో పంటల బీమా పథకం అమలులో ఉంది మరియు భూమి ఉన్న ప్రతి రైతు దీనికి అర్హులు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు ఎస్.ఎన్. మంజునాథ్ తెలిపారు. బళ్లారి తాలూకా యంత్రాంగం, వ్యవసాయ శాఖ మరియు హగరి కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హగరి కృషి విజ్ఞాన కేంద్రంలో 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, ప్రత్యామ్నాయ పంటల విధానాలు మరియు కరువు నిర్వహణ చర్యల'పై రైతులకు అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఆయన పేర్కొన్నారు. బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న వారికి బీమా తప్పనిసరి అని, అలాగే విత్తనాలు వేయడానికి ముందే రైతులు బీమా చేయించుకోవడం మంచిదని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ సమీపంలోని 'గ్రామ వన్' లేదా 'కస్టమర్ సర్వీస్ సెంటర్'ను సందర్శించి బీమా వాయిదా మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. బళ్లారి ప్రాంత రైతులు పత్తి, మొక్కజొన్న, సజ్జ మరియు జొన్న వంటి కరువును తట్టుకునే పంటలకు తప్పనిసరిగా బీమా కల్పించాలని కోరారు. వర్షాధార మరియు నీటి పారుదల సౌకర్యం ఉన్న పొద్దుతిరుగుడు, పత్తి మరియు జొన్న పంటలకు బీమా చేయించుకోవడానికి జూలై 31 చివరి తేదీ అని బళ్లారి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గర్జప్ప తెలిపారు. రైతులు వెంటనే బీమా కోసం నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇంకా విత్తనాలు వేయని ప్రాంతాల్లో 'వి బి జి రామ్ జి' మరియు 'కృషి భాగ్య' పథకాల కింద కందకాల, వ్యవసాయ కుంటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాల కొరత ఉన్నందున, రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లాభాలు పొందాలని ఆయన సలహా ఇచ్చారు.ల నేల చదును చేయకుండా దున్నినట్లుగానే వదిలేయడం వల్ల వర్షం పడినప్పుడు నీరు నేలలోకి బాగా ఇంకుతుందని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి మరియు నేల శాస్త్రవేత్త డాక్టర్ రవి ఎస్. తెలిపారు. ఆగస్టు చివరిలో వర్షాలు కురిసినా గోధుమ, జొన్న మరియు రాగి పంటలను సాగు చేయవచ్చని ఆయన చెప్పారు. నేల సారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట ఎరువుల పంటలను సాగు చేయాలని ఆయన సూచించారు. వాతావరణ సూచన గురించి మాట్లాడుతూ, వ్యవసాయ నిపుణుడు డాక్టర్ కృష్ణమూర్తి ఈసారి దేశంలో 70 శాతం ప్రాంతాల్లో వర్షాభావం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు; అలాగే తక్కువ నీటి అవసరమున్న కుసుమ, సజ్జ, బక్‌వీట్ మరియు జలసంది వంటి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. బళ్లారి తాలూకాలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన వందలాది మంది ప్రగతిశీల రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అందించిన సూచనలు మరియు సలహాలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ పాలయ్య, డాక్టర్ నవీన్, సహాయ ఉద్యానవన అధికారి సునీల్, తాలూకా కృషిక సమాజ్ సభ్యులు గోపాల రెడ్డి, రామన్న, దొడ్డబసవరాజ్, హోబ్లీ వ్యవసాయ అధికారులు, 'ఆత్మ' ప్రాజెక్ట్ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కవితా కుమారి మరియు 'కృషి సంజీవని' సిబ్బంది పాల్గొన్నారు.

## జేసీ అస్మిత్, ప్రభాకర్ రెడ్డిలతో జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి సమావేశం

పార్టీ కార్యక్రమాలపై సమీక్ష
సంస్థాగత బలోపేతంపై తండ్రీ కొడుకులతో సుదీర్ఘ చర్చలు



**తాడిపత్రి జులై 23 సీమ వార్త సాయంత్రం** :జిల్లా కో-ఆర్డినేటర్‌గా అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా తాడిపత్రి శాసనసభ్యుడు జేసీ అస్మిత్ రెడ్డిని, మాజీ శాసనసభ్యుడు జేసీ ప్రభాకర్ రెడ్డిని వారి కార్యాలయంలో రెడ్డెప్పగారి శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రి నియోజకవర్గంతో పాటు అనంతపురం జిల్లాలో పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు, రాబోయే ప్రజా కార్యక్రమాల అమలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై మరింత పటిష్టంగా పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా జేసీ అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కష్టాన్ని గుర్తించి, అందరినీ సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## హైవేపై ఇసుక ట్రాక్టర్ - లారీ ఢీ

ట్రాక్టర్ డ్రైవర్, లారీ క్లీనర్‌కు స్వల్ప గాయాలు
పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ క్లియర్



**తాడిపత్రి జులై 23 సీమ వార్త సాయంత్రం :** గురువారం ఉదయం తాడిపత్రి మండల పరిధిలోని కావేరి సముద్రం హైవేపై బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన నాగ సుబ్బరాయుడు నడుపుతున్న ఇసుక ట్రాక్టర్ బుగ్గ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో ట్రాక్టర్ హైవేపై అడ్డంగా పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు మరియు లారీ క్లీనర్‌కు స్వల్ప రక్త గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే 108 కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇరువురి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు జేసీబీ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాక్టర్‌ను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో సుమారు 1 గంటలపాటు నిలిచిపోయిన వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 12 ఏళ్లుగా సేవలందిస్తున్న ఎంపీఈఓలను రెగ్యులర్ చేయాలి

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి వినతిపత్రం అందజేసిన సంఘం నాయకులు
సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తాం :-మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



**పుట్టపర్తి, జులై 23 (సీమవార్త సాయంకాలం బ్యూరో) :-** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖలో గత 12 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన సేవలందిస్తున్న మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు) గురువారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ఎంపీఈఓల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే అసెంబ్లీలోనూ ప్రస్తావించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు, పథకాల అమలు, పంటల నమోదు, ఫీల్డ్ తనిఖీలు, ప్రకృతి వైపరీత్యాల నివేదికలు, డిజిటల్ డేటా నమోదు వంటి బాధ్యతలను 12 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని, అయినా రెగ్యులర్ హోదా, ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనం లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16, 21, 39(డి) స్ఫూర్తికి, సుప్రీంకోర్టు సూత్రాలకు అనుగుణంగా ఎంపీఈఓలను రెగ్యులర్ చేయాలని కోరారు.గత 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఎంపీఈఓలను వెంటనే రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం సూత్రం ప్రకారం న్యాయమైన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ ఉద్యమం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, రైతులకు సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు జాఫర్ వలి, రాజేష్ బాబు, సోమశేఖర్, గంగరాజు, అనిత, భవ్య, మీనా, ముబీన తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య, ఎల్ ఈ వో పై సమీక్షించిన జిల్లా కలెక్టర్






**మడకశిర జులై 23 సీమ వార్త** పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన "త్రాగునీటి సమస్యలు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం"లో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్రీ శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి , మడకశిర ఆర్డీఓ ఆనంద్ కుమార్ , బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు డా. శ్రీనివాసమూర్తి , రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ శ్రీ లక్ష్మీనారాయణ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ గురిమూర్తి పాల్గొన్నారు.
అదేవిధంగా ఎంపీడీఓలు, రామారావు, శ్రీనివాసరావు, సోనియాబాయి, ఆర్‌డబ్ల్యూఎస్ డి మను నాయక్,, పీఆర్ ఒ ఆర్‌డీ శాఖల అధికారులు సిబ్బంది, అన్ని మండలాల టీడీపీ కన్వీనర్లు, నాగరాజు, ఈరన్న, తిప్పే స్వామి, లక్ష్మీనరసప్ప, మండల కన్వీనర్ నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, కుమారస్వామి, గణేష్, మద్దనకుంటప్ప, నరేష్ కన్నా, ఏపీఐఏసీ డైరెక్టర్ రామకృష్ణ, బీసీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వి ఎం పాండురంగప్ప, హాజరై త్రాగునీటి సమస్యల నివారణ, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై విస్తృతంగా చర్చించారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం
23 జూలై 2026

# కమ్మల వాండ్ల పల్లెలో రూ, 70 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్

## ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసిన కన్వీనర్ బాలకృష్ణ చౌదరి.





**గోరంట్ల జూలై 23 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల మండలం గౌనివారిపల్లి పంచాయతీలోని కమ్మలవాండ్లపల్లి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ 70.96 లక్షలతో నిర్మించబోవు ట్యాంకుపై టిడిపి మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి, రాష్ట్ర హాస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, టీడీపి జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, పాలసముద్రం, వానవోలు, గౌనివారిపల్లి, సింగల్ విండో అధ్యక్షులు, బెల్లలచెరువుచంద్ర, నిమ్మల శ్రీధర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షులు సంతోష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్యాంకు నిర్మాణ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి నీళ్లు ఇవ్వాలన్న లక్ష్యంతో మంత్రి సవితమ్మ ఆదేశాలతో మంజూరైన నిధులతో పనులు ప్రారంభించినట్లు కన్వీనర్ బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ, రవిమోహన్,5మ్యాన్ కమిటీ మెంబర్ గంగాధర్, 6మ్యాన్ కమిటీ సభ్యులు, నాగేనాయక్ గిరిధర్ గౌడ్ కూరమాల జయరాం, షేక్ అజ్మతుల్లా, మాజీ సర్పంచ్ ఉత్తమరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చెర్మన్ తిరుపాల్, సాగునీటీ సంగం అధ్యక్షులు వేణుగోపాల్, కమ్మలవాండ్లపల్లి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ రమణారెడ్డి, ఆర్ బ్ల్యూఎస్ మెహన్,ఈశ్వర్, నాగేంద్ర, రఘునాథ్,జనసేన కావేరి, రాజు,పగడాల ప్రభాకర్, రమేష్, రవి,అనిల్,రంగప్ప,స్టోర్ డీలర్స్, కూటమి నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ మారెమ్మ గుడిలో.... భక్తి-సేవా భావంతో ఉచిత వైద్య శిబిరం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న... జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు జి.ఎం. సురేష్

**గోరంట్ల, జూలై 23 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల మండలం గుమ్మయగారిపల్లిలో వెలసిన శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో భక్తి, సేవా భావాల సమ్మేళనంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి దేవి రాజస్వామి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శ్రీ రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాని కి ముఖ్యఅతిథిగా శ్రీ సత్యసాయి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు జి.ఎం. సురేష్, హాజరై శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జి.ఎం. సురేష్ మాట్లాడుతూ, దైవారాధనతో పాటు మానవ సేవను అత్యున్నత ధర్మంగా భావిస్తూ శ్రీ మారెమ్మ దేవాలయం ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో కూడా రెడ్ క్రాస్ సొసైటీ తరఫున ఇక్కడ వైద్య శిబిరాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, సమాజ ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న డాక్టర్ బి. దేవిరాజు స్వామి, ఆలయ ట్రస్ట్ సభ్యులు, రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందాన్ని అభినందించారు.
డాక్టర్ బి. దేవిరాజు స్వామి మాట్లాడుతూ, "మానవసేవయే మాధవసేవ" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శ్రీ మారెమ్మ దేవి ఆశీస్సులతో పేద, బడుగు బలహీన వర్గాలకు ఆరోగ్య సేవలు




అందించడం తమ లక్ష్యమని, భక్తి ఉన్న చోట సేవ, సేవ ఉన్న చోట దైవానుగ్రహం ఉంటుందని అన్నారు.
ఈ ఉచిత వైద్య శిబిరంలో 230 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, మెరుగైన చికిత్స అవసరమైన 25 మందిని తిరుపతిలోని శ్రీ రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు రేఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామి, శ్రీ సత్యసాయి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు జి.ఎం. సురేష్, శ్రీనివాస్ గుప్తా ఆలయ కమిటీ సభ్యులు పుటక శంకర, రామ్మోహన్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి, ఆదినారాయణ, సూరి, వైద్య బృందం డాక్టర్లు వెంకటేష్, మనోహర్, పావని, హేశ్విత తదితరులు పాల్గొన్నారు.

### విప్లవ వీరులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ గార్ల జయంతి సందర్భంగా




**కడప జూలై 23 సీమ వార్త. సాయంత్రం.** జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కార్యాలయంలో భారత స్వాతంత్ర్య సమరయోధులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్, అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్ మరియు కడప అసెంబ్లీ ఇంచార్జ్ సుంకర శ్రీనివాస్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూలోకమాన్య బాలగంగాధర్ తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే నినాదంతో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త ఊపునిచ్చారని, చంద్రశేఖర్ ఆజాద్ తన ధైర్యసాహసాలు, త్యాగనిరతితో దేశ యువతకు చిరస్థాయిగా ఆదర్శంగా నిలిచారని అన్నారు. అలాంటి మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ దేశభక్తి, సేవాభావంతో సమాజ అభివృద్ధికి కృషి చేయడం వారందరికీ నిజమైన నివాళి అని పేర్కొన్నారు. యువత మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ ప్రగతికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, కార్యకర్తలు మరియు ప్రజా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

### జులై 24 తేదీ బంద్ సహకరించి జయప్రదం చేయండి...

అన్ని విద్యార్ధి సంఘాల ఆధ్వర్యంలో జులై 24 వతేది విద్యాసంస్థల బంద్...



**బద్వేల్ జూలై 23 సీమవార్త . సాయంత్రం.** నీట్ పేపర్ లేకేజికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ, పేపర్ లీక్ కారణంగా చనిపోయిన 23 మంది విద్యార్థులు కుటుంబాలకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ శాంతియుతంగా దీక్షలు చేస్తున్న వారిపై దీజేపీ ప్రభుత్వం అత్యంత పాశవికంగా లాఠీ ఛార్జి చేయడాన్ని ఖండిస్తూ, దీక్షలకు సంపూర్ణ మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యార్ధి సంఘాల ఆధ్వర్యంలో జులై 24 వతేది విద్యాసంస్థల బందుకు పిలుపునివ్వడం జరిగింది. కావున తమరు బందుకు మద్దతుగా మన విద్యాసంస్థకు సెలవు ప్రకటించి ప్రత్యేకంగా, పరోక్షంగా పాల్గొని విజయవంతం చేయాలనీ విద్యార్ధి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ తరపున విజ్ఞప్తి చేస్తున్నాము. ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండి.అనిల్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి రవి, ఏఐఎస్ బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి.రాజేంద్ర పాల్గొన్నారు.

### కార్యకర్తకు మాజీ ఎంమ్మెల్యే విజయమ్మ భరోసా...

**బద్వేల్ జూలై 23 సీమవార్త. సాయంత్రం.** బద్వేల్ నియోజకవర్గం అనంత రాజపురం పంచాయతీ తిమ్మరాజు పల్లె కు చెందిన దుర్వాసుల వీరమరాజు దీర్ఘకాలిక మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ ఉన్న విషయం తెలుసుకున్న బద్వేల్ మాజీ శాసనసభ్యురాలు కే.విజయమ్మ వారి యొక్క స్వగృహానికి వెళ్లి పరామర్శించినారు. అనంతరం గ్రామ పెద్దలతో గ్రామాభివృద్ధికి సంబంధించిన విషయాలు చర్చించారు . ఈ కార్యక్రమంలో బద్వేల్ మండలం సొసైటీ అధ్యక్షుడు మన్యం రామ్ రెడ్డి,మాజీ ఎంపీపీ బైసాని ప్రతాపరెడ్డి, రైల్వే కాంట్రాక్టర్ మేరెడ్డి శ్రీనివాసలురెడ్డి,జోగి రెడ్డిగారిపల్లి మాజీ ఎంపిటిసి జయరాములు,రామరాజు, కుమార్, శ్రీనివాసరాజు, సుబ్బరాజు, వెంకట సుబ్బరాజు, ఎలక్ట్రికల్ వెంకటసుబ్బారెడ్డి, డీలర్ శ్రీనివాసులు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పేరయ్య, శీను, మాదిగ రవి, చిన్నయ్య, రమణ, వెంకటసుబ్బయ్య ఈగ సుబ్బారెడ్డి మెకానిక్ వెంకటసుబ్బారెడ్డి,అనుగుంది శివకుమార్,పొన్న రాజేష్,సిద్ధ మూర్తి, మహేశ్వర్



రెడ్డి,బిజివేముల విజయ్ రెడ్డి ,వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### త్రాగునీటి సమస్య ను తీర్చిన ఎంపిడిఓ రామనాయక్.

...హర్షం వ్యక్తం చేసిన తండా వాసులు.



**తనకల్లు జులై 23 సీమ వార్త సాయంత్రం.** తనకల్లు మండల పరిధిలోని రామ్లనాయక్ తాండాలో ఊరి బోరుమోటార్ చెడిపోయి చాలా ఇబ్బందులు ఎదురుకొంటున్న తండావాసులు ఊరు బోరు మోటార్ రిపేరి వల్ల త్రాగు నీటి కోసం తండా వాసులు సేద్యం బోరులు దగ్గర నుండి నీటిని తెచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నామని తనకల్లు మండల ఎంపిడిఓ దృష్టికి తండా గ్రామ ప్రజలు తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి కొత్త పంపు సెట్టు తీసుకొచ్చి ఆయనే దగ్గర ఉండి పంపు సెట్టు మెకానిక్ ను పిలిపించి పంపు సెట్టును బిగించడం జరిగింది. ఆ తండా లో త్రాగునీటి సమస్య ను వెంటనే పరిష్కరించిన ఎంపిడిఓ రామ నాయక్ కు తండా వాసులు కృతజ్ఞతలు తెలియ జేసీ హర్షం వ్యక్తం చేశారు.

### అగాపే ఆశ్రమంలో అనాధ పిల్లలకు దాతలు చేయూత



**యాడికి జులై 23 సీమ వార్త సాయంకాలం** యాడికి మండలకేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీ లో ఉన్న అగాపే ఆశ్రమంలో ఉంటున్న అనాధ పిల్లలకు కొంతమంది దాతలు సహాయం చేయడం జరిగింది. గత రెండు నెలల క్రితం పెద్దపేట గ్రామంలో తండ్రిని కోల్పోయి తల్లి జైలుకెళ్లడం ద్వారా అనాధలుగా మిగిలిన నలుగురు పిల్లల గూర్చి ఆలోచించి,వారికి తమ వంతుగా సహాయం చేయాలని తలంచి మాజీ మండల కన్వీనర్ రుద్రమ నాయుడు గారి ఆధ్వర్యంలో రాయలచెరువు ప్రాంతానికి చెందిన మాదాల విశ్వనాథ్ నాయుడు, కత్తి శ్రీనివాసులు, ఏసీ వెంకట్ నారాయణ, మోటుపల్లి బాలు రంగయ్య, చెన్నంపల్లి సంజప్ప, మోటుపల్లి జయరాముడు మరియు నరసింహ చౌదరి, నీలకంఠారెడ్డి వీరందరూ కలిసి అగాపే ఆశ్రమం ఫౌండర్ బత్తల ప్రసాద్ గారికి పిల్లల భవిష్యత్తు నిమిత్తమై 21,800 రూపాయలు ఆయనకు అందజేశారు. అంతేకాకుండా వారికి సంబంధించి ఇంకా ఏమైనా మేము సహాయం చేస్తామని, ఆశ్రమానికి కూడా మేము ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రసాద్ గారికి భరోసా ఇచ్చారు. ఆ నలుగురు పిల్లలతో పాటు పౌండర్ ప్రసాద్ గారు కూడా వారికి చేసిన సహాయాన్నిబట్టి కృతజ్ఞతలు తెలిపి ఆనంద వ్యక్తం చేశారు.

### అర్బన్ బ్యాంకు నూతన వైస్ చైర్మన్లు ఎంపిక.

చైర్మన్ జేఎల్ మురళి ఆధ్వర్యంలో సన్మానం.



**అనంతపురం 23 సీమ వార్త సాయంత్రం.** అనంతపురం అర్బన్ బ్యాంక్ నందు నేడు పాలకవర్గ సమావేశం లో పాలకవర్గం ముందుగా నిర్ణయించిన మేరకు గత సంవ్సర కాలం నుండి వైస్ చైర్మన్లు గా వ్యవహరించిన వి. జి. సుబ్రమణ్యం మరియు మాగిశెట్టి చంద్ర శేఖర్ తమ పదవికి రాజీనామా చేయగా నూతన వైస్ చైర్మన్లు గా చింతల భాస్కర్ మరియు జంగటి శెట్టి రామాంజినేయులు ని పాలకవర్గ సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నేటి నుండి సంవత్సర కాలం నూతన వైస్ చైర్మన్లు గా భాద్యతలు నిర్వహిస్తారు. అదే విధంగా బ్యాంక్ ఆఫ్ మేనేజ్మెంట్ కమిటీ ని ఏర్పాటు చేస్తూ ,పాలకవర్గం నుంచి సభ్యుని గా రోళ్ల భాస్కర్ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ డా. జె. ఎల్. మురలీధర్ పాలకవర్గ సభ్యులు నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ వారిని సత్కరించడం జరిగింది.

### నేడు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ కు పిలుపు



**అమరాపురం జూలై 23 సీమ వార్త సాయంత్రం** దేశవ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ కు శుక్రవారం పిలుపునివ్వడంతో మండల స్థాయి ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ ,సిపిఎం అనుబంధ సంఘాల నాయకులు నాగభూషణ్, మహబూబ్ ఖాన్ లు మండల కేంద్రంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ కు సహకరించాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులకు విన్నపం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. గత రెండు రోజుల క్రితం ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నీట్ పరీక్ష పేపర్ లీక్ జరిగినందున విద్యార్థులు నిరసనలు తెలియజేస్తుంటే పోలీసులు అడ్డుకొని విచక్షణ రహితంగా, ఇష్టానుసారంగా లాఠీలతో కొట్టిన సందర్భంగా రక్తస్రావంతో విద్యార్థి సంఘాల నాయకులు నిరసనలు తెలియజేశారు. అందుకు ఐక్య విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా శుక్రవారం ప్రభుత్వ ప్రవేట్,విద్యాసంస్థల బంద్ కు పిలుపునివ్వడం జరిగింది కావున విద్యాసంస్థలు సహకరించి నేడు చేపట్టే విద్యాసంస్థల బంద్ కు మద్దతు ఇచ్చి సహకరించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కోరారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881